బాబోయ్ ప్లాస్టిక్ భూతం

నిషేధం ఉన్నా విచ్చలవిడిగా పాలిథిన్ సంచుల వినియోగం



- పర్యావరణ సమతుల్యానికి తీవ్ర విఘాతం
- మొక్కుబడిగా అధికారుల తనిఖీలు
- వర్తకులు, వినియోగదారుల్లో రాని మార్పు
- పాలిథిన్ కవర్లలో వేడి పదార్థాలు వేస్తే క్యాన్సర్ బారిన పడతామని తెలిసినా అలవాటు మానుకోని ప్రజలు

నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినం సందర్భంగా...

(అనకాపల్లి/నర్సీపట్నం- ఆంధ్రజ్యోతి)

ప్లాస్టిక్ భూతం మానవాళి మనుగడపై పెను సవాల్ విసురుతోంది. ప్లాస్టిక్ సంచుల మితిమీరిన వాడకం వల్ల పర్యావరణం ప్రశ్నార్థకంగా మారుతోంది. పాలిథిన్ సంచుల వల్ల మూగ జీవాల ప్రాణాలకు హాని కలుగుతోంది. మానవాళి మనుగడపై తీవ్ర ప్రభావం చూపే ప్లాస్టిక్ వినియోగం తగ్గించి గోనె (జూట్), కాగిత సంచులు వినియోగించాలని పర్యావరణ వేత్తలు మొరపెట్టుకుంటున్నా ప్రజల చెవికెక్కడం లేదు. రెండేళ్ల కిందట ప్లాస్టిక్ సంచుల వినియోగంపై విధించిన నిషేధం అమలులో ఆపసోపాలు పడుతున్నారు. ఫలితంగా యథేచ్ఛగా ప్లాస్టింగ్ సంచుల వినియోగం పెరిగిపోవడమే కాకుండా అదుపు చేసేవారే కరువయ్యారు.

ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువుల వినియోగంపై గత ప్రభుత్వం నిషేధం విధించి రెండేళ్లు గడిచిపోతున్నా జిల్లాలో అమలుకు నోచుకోలేదు. ఎప్పటి లాగానే యథేచ్ఛగా ప్లాస్టిక్ సంచులు (పాలిథిన్) వినియోగిస్తూ పర్యావరణానికి తీవ్ర ముప్పు కలిగిస్తున్నారు. మొక్కుబడిగా ప్లాస్టిక్ సంచుల వినియోగంపై 2022 జూలై నెలలో నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన గత వైసీపీ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అమలు చేయలేకపోయింది. ప్రతి మనిషి నిత్యం సగటున 25 నుంచి 60 గ్రాముల వరకు ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్టు పలు సర్వే సంస్థలు పేర్కొంటున్నాయి. ఈ లెక్కన అనకాపల్లి జిల్లాలో 18 లక్షలు పైచిలుకు జనాభా టన్నులకొద్దీ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. ప్రతి రోజు వినియోగిస్తున్న ప్లాస్టిక్ సంచులు చెత్త కుప్పల్లో దర్శనమిస్తున్నాయి. చెత్తతో పాటు ప్లాస్టిక్ సంచులను డంపింగ్ యార్డులకు తరలిస్తున్నా అవి భూమిలో కలిసిపోకుండా భూమి, వాయు కాలుష్యానికి కారణభూతంగా మారుతున్నాయని, ఇది మానవాళి అనారోగ్య సమస్యలకు ప్రధాన కారణమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఎంతో ప్రమాదం



వేడి పదార్థాలు ప్లాస్టిక్ కవర్లలో పడితే అనేక కెమికల్స్ విడుదలవుతాయి. ఈ కెమికల్స్ శరీరం లోపలికి వెళ్లడం వల్ల పలు వ్యాధులు సంక్రమిస్తాయి. శరీరంలోని ఈస్ట్రోజెన్ హార్మోన్స్‌తో ప్లాస్టిక్ అనేది కాంటాక్ట్‌లోకి వస్తే గుండె సంబంధిత వ్యాధులు, డయాబెటిస్, న్యూరలాజికల్ వ్యాధులు, క్యాన్సర్, థైరాయిడ్, జెనిటల్ మాల్ ఫార్మేషన్స్‌తోపాటు మరెన్నో ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



అనకాపల్లిలోని డంపర్ బిన్‌లో పేరుకుపోయిన పాలిథిన్ కవర్లు

విచ్చలవిడిగా పెరిగిన వినియోగం

జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీలతో పాటు 21 గ్రామీణ మండలాల్లో ప్లాస్టిక్ సంచుల వినియోగం ఇటీవల కాలంలో పెరిగిపోయింది. జిల్లా కేంద్రం అనకాపల్లితో పాటు నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల పరిధిలో నిషేధం అమలులో వున్నా, ఇప్పటికీ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ అమ్మకాలు జరుగుతూనే ఉన్నాయి. వాస్తవానికి 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉండే పాలిథిన్ కవర్లను వినియోగిస్తే నేరం. అయితే ఈ నిబంధనలను పట్టించుకోకుండా అనకాపల్లి హోల్‌సేల్ మార్కెట్‌లో ప్రతి రోజు 500 కిలోల వరకు పాలిథిన్ కవర్ల అమ్మకాలు జరుగుతున్నాయంటే వినియోగం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పాలిథిన్ సంచులు వినియోగించి వాటిని ఆరుబయట, చెత్తతో పాటు పడేస్తున్నారు. కొందరు డ్రైనేజీల్లో వేస్తున్నారు. దీని వల్ల అశుభ్రమైన వాతావరణాన్ని కలుగజేసి, దుర్వాసన వెదజల్లడం, నీటి ద్వారా ప్రబలే వ్యాధులకు కారణమవుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్తకుప్పలపై పేరుకుపోయి పర్యావరణానికి పెను ముప్పు కలిగిస్తున్నాయి.

ప్లాస్టిక్ కవర్లలో టీ, కాఫీ, కూరల పార్శిళ్లు

అల్పాహార, మాంసాహార హోటళ్లు, ఫుట్‌పాత్ టీ దుకాణాలలో వేడి టీ, కాఫీ, పాలు, కూరలు పాలిథిన్ సంచులలో పార్శిల్ చేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లలో పార్శిల్ చేసిన వేడి ఆహార పదార్థాలు తినడం వల్ల క్యాన్సర్, జీర్ణకోశ సంబంధిత వ్యాధుల బారిన పడతారని తెలిసినా ప్రజలు వినియోగించడాన్ని మానడం లేదు. ఉద్యోగులు, విద్యావంతులు సైతం కర్రి పాయింట్ల వద్ద పల్చని పాలిథిన్ కవర్లలో పార్శిల్ చేసిన వేడి ఆహార పదార్థాలు కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల ... మిగతా 8వ పేజీలో

కొత్త కలెక్టర్‌గా విజయకృష్ణన్

ప్రస్తుత కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి బదిలీ



కొత్త కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి):

జిల్లా కలెక్టర్‌గా విజయకృష్ణన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను అనకాపల్లి జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిని బదిలీ చేస్తూ, ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

తమిళనాడుకు చెందిన విజయకృష్ణన్ 2013 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. 2022లో కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాకు కలెక్టర్‌గా నియమితులై 2023 ఏప్రిల్ 13వ తేదీ వరకు పనిచేశారు. తరువాత సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆమెను అనకాపల్లి జిల్లా కలెక్టర్‌గా నియమించింది. ఆమె అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ సతీమణి. కాగా ఆమె రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

పాలనలో రవి పట్టన్‌శెట్టి ప్రత్యేక ముద్ర

జిల్లాల పునర్విభజన తరువాత ఏర్పడిన అనకాపల్లి జిల్లా కలెక్టర్‌గా రవి పట్టన్‌శెట్టి పరిపాలనలో తనదైన ముద్ర వేసుకున్నారు. కలెక్టరేట్‌తో సహా వివిధ ప్రభుత్వ శాఖలకు సొంత భవనాలు లేని జిల్లాలో ఆయన పనిచేసిన కాలంలో పరిపాలనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రజలకు సేవలందించేందుకు కృషి చేశారు. 2022 ఏప్రిల్ 4న అనకాపల్లి జిల్లా కలెక్టర్‌గా రవి పట్టన్‌శెట్టి వైద్య ఆరోగ్యశాఖ కమిషనరేట్ నుంచి బదిలీపై వచ్చారు. రెండేళ్లకు పైగా పనిచేసిన ఆయన పరిపాలనలో తనదైన ముద్ర వేసుకున్నారు. వివాదాలకు దూరంగా ఉంటూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనిచేస్తారని గుర్తింపు తెచ్చుకున్నారు. కలెక్టరేట్‌కు కొత్త భవనంలో అన్ని శాఖలకు నెల రోజుల్లోనే వసతులు కల్పించి ఈ-ఆఫీసింగ్ సేవలను అందుబాటులోకి తేవడంలో ఎంతో కృషి చేశారు. కొత్తగా ఏర్పడిన జిల్లాకు ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవన సముదాయం నిర్మాణాల కోసం స్థల సేకరణ పూర్తిచేసి, కేంద్రప్రభుత్వానికి డీపీఆర్ సమర్పించారు.

ప్రధానమంత్రి చేతుల మీదుగా అవార్డు



న్యూఢిల్లీలో గత ఏడాది పీఎం చేతుల మీదుగా అవార్డు అందుకున్న రవి పట్టన్‌శెట్టి (ఫైల్)

వైద్య, ఆరోగ్యశాఖలో సమూల మార్పులపై కలెక్టర్‌గా రవి పట్టన్‌శెట్టి క్షేత్ర స్థాయిలో స్టడీ చేసి 2023లో రాష్ట్రం నుంచి న్యూఢిల్లీలో స్వస్థ్ భారత్ (హెల్త్ భారత్)విభాగంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు రాష్ట్రం నుంచి రవి పట్టన్‌శెట్టి ఒక్కరే ఎన్నికయ్యారు. క్షేత్రస్థాయిలో వైద్య రంగంలో ఎటువంటి మార్పులు చేస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయన్న అంశంపై రవి పట్టన్‌శెట్టి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు పీఎం నరేంద్ర మోదీ ప్రశంసల జల్లు కురిపించారు. ప్రైమినిస్టర్స్ అవార్డు ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అవార్డు (పీఎంఏఈఏపీ అవార్డు-2022) ను ప్రతిష్ఠాత్మకమైన పీఎం ప్రశంసా పత్రాన్ని గత ఏడాది న్యూఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అందుకున్నారు.

దూర విద్యలోనూ ఇష్టారాజ్యం

పరీక్షా కేంద్రాలు భారీగా పెంపు

- గతంలో 50, ఇప్పుడు 100
- పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసిన కాలేజీల నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు
- బయటి నుంచి వచ్చి చేరిన అధికారే చక్రం తిప్పినట్టు విమర్శలు
- అప్పటి ఏయూ ఉన్నతాధికారుల అండదండలు
- పరీక్షల నిర్వహణలో అవకతవకలకు అవకాశం



విశాఖపట్నం, జూలై 2 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పరీక్షా కేంద్రాలను ఇబ్బడిముబ్బడిగా పెంచేశారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి నుంచి అటు కృష్ణా జిల్లా వరకూ గతంలో 50 పరీక్షా కేంద్రాలు ఉండేవి. అయితే, గత ఏడాది కాలంలో ఈ సంఖ్య వందకు చేరింది. ఈ వ్యవహారంలో ప్రైవేటు కాలేజీ నుంచి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విభాగంలోకి వచ్చిన ఒక అధికారి చక్రం తిప్పినట్టు చెబుతున్నారు. ఇందుకోసం భారీమొత్తంలో డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

విద్యార్థుల నుంచి పరీక్షల సమయంలో దండుకోవచ్చునన్న ఉద్దేశంతో అనేక కాలేజీలు దూర విద్య పరీక్షా కేంద్రాల కోసం దరఖాస్తు చేసుకుంటుంటాయి. వీటిలో తమకు కావాల్సిన కాలేజీలకు సదరు అధికారి ఎగ్జామ్ సెంటర్లు మంజూరు చేయించారని చెబుతున్నారు. అందుకు అప్పట్లో వర్సిటీలోని కొందరు అధికారులు అడ్డుచెప్పినప్పటికీ నాటి వీసీ అండదండలతో ఆయన తాను అనుకున్నది చేసేశారని చెబుతున్నారు. ఈ వ్యవహారంలో నాటి ఉన్నతాధికారులకు కూడా ముడుపులు అందినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరీక్ష కేంద్రాల కేటాయింపులో అప్పటి డైరెక్టర్‌గా ఉన్న అధికారిని కూడా ప్రైవేటు కాలేజీ నుంచి వచ్చిన వ్యక్తి డమ్మీని చేశారన్న ప్రచారం ఉంది. ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటు కోసం ఒక్కో కాలేజీ భారీగా ముట్టజెప్పాయని, దీనిపై కొత్తగా వచ్చే వైస్ చాన్సలర్, ఇతర అధికారులు దృష్టిసారించి విచా రణ జరిపించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

ఎగ్జామ్ సెంటర్‌తో మేలు

గతంతో పోలిస్తే ఏయూ దూరవిద్యా కేంద్రంలోని కోర్సుల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఏటా కనీసం పది వేల నుంచి 15 వేల మంది చేరుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల నుంచి ఎంతోకొంత గుంజుకోవచ్చునన్న ఉద్దేశంతో కొన్ని కాలేజీలు పరీక్షా కేంద్రాల ఏర్పాటుకోసం యత్నిస్తున్నాయి. ఈ విధంగా నగర పరిధిలోని ఓ కాలేజీకి పరీక్షా కేంద్రాన్ని కేటాయించారు. విద్యార్థుల నుంచి ఆ కాలేజీ అధికారులు రూ.2 వేల నుంచి రూ.3 వేల వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. విద్యార్థికి అవసరమైన సహకారాన్ని అందించాలంటే మరింత చెల్లించాల్సిందేనని చెబుతున్నారు. డబ్బులు ఇవ్వనివారిని ఇబ్బందులకు గురిచేస్తుంటారంటున్నారు. పరీక్షలు నిర్వహించిన ప్రతిసారి తమకు కేటాయించే విద్యార్థుల ద్వారా కొంత ఆదాయం సమకూర్చుకునేందుకు ... మిగతా 8వ పేజీలో



మంచాల పొలంలో దుక్కిదున్నుతున్న రైతు

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

- వాతావరణం సహకరించడంతో విత్తనాలు వేయడంలో నిమగ్నం

చీడికాడ, జూలై 2: గత రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో వరి విత్తనాలు వేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. మూడు రోజుల క్రితం వరకు రోజూ వర్షాలు కురవడంతో వరి ఆకుమడులు ఆరవేమోనని రైతులు ఆందోళనకు గురయ్యారు. అయితే రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో పల్లపు ప్రాంతాల్లో వరి ఆకుమడుల్లో నీరు చేరినప్పటికీ మెట్ట ప్రాంతాల్లో మాత్రం వరి విత్తనాలు వేసుకునేందుకు కాస్త అనుకూలంగా ఉండడంతో మంగళవారం మంచాల, శిరిజాం, ఖండివరం, ఎల్‌బీ పట్నం గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో విత్తనాలు వేసే పనిలో నిమగ్నమయ్యారు.

పౌరుగూరు వెళ్లి మరీ పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం, కాకినాడ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు అందజేత

- సచివాలయ సిబ్బంది సేవలకు ప్రశంసలు
- సహకరించిన 5వ వార్డు సభ్యుడికి అభినందనలు



రాజమహేంద్రవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, జూలై 2: అనారోగ్యంతో రాజమహేంద్రవరం, కాకినాడ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న ఇద్దరు లబ్ధిదారులకు పాయకరావుపేట సచివాలయం-2, 3కి చెందిన సిబ్బంది మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే గుండె ఆపరేషన్ చేయించుకుని జగ్గంపేటలో విశ్రాంతి తీసుకుంటున్న ఓ వృద్ధురాలికి కూడా పింఛన్ అందజేశారు. వీరికి పాయకరావుపేట పంచాయతీ 5వ వార్డు సభ్యుడు, టీడీపీ నాయకుడు మలిపెద్ది వెంకటరమణ సహకరించారు. సోమవారం పింఛన్లు పంపిణీ చేసిన సిబ్బంది ముగ్గురు లబ్ధిదారులు పౌరుగూరులో ఉన్నట్టు గుర్తించారు. వారి వివరాలను 5వ వార్డు సభ్యుడు వెంకటరమణ తెలుసుకుని తన కారులో సచివాలయ సిబ్బందిని లబ్ధిదారులు ఉన్న చోటకు తీసుకువెళ్లారు. గుండె ఆపరేషన్ చేయించుకుని జగ్గంపేటలో విశ్రాంతి తీసుకుంటున్న బొమ్మన అచ్చిరాజుకు వృద్ధాప్య పింఛను రూ.7 వేలు, రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగురాలు బళ్ళ నాగమణికి రూ.6 వేలు, కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జట్ల రామలింగప్రసాద్‌కు వృద్ధాప్య పింఛను రూ.7 వేలును సచివాలయ సిబ్బంది నందిని, మన్నియ్య అందజేశారు. వీరి సేవలను పలువురు కొనియాడారు. అలాగే వార్డు సభ్యుడిని అభినందించారు.

జిల్లాలో 98.98 శాతం పింఛన్లు పంపిణీ

అనకాపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ మంగళవారం నాటికి 98.98 శాతం పూర్తి చేశామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ పీడీ) శశీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,64,033 మంది వివిధ రకాల అర్హులైన పింఛన్ లబ్ధిదారులు ఉండగా, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా 2,61,336 మందికి (98.98 శాతం) పంపిణీ పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. మిగతా వారు అందుబాటులో లేని కారణంగా పంపిణీ చేయలేదన్నారు. వారికి కూడా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

కృష్ణాదేవిపేటలో అల్లూరి జయంతికి ముమ్మర ఏర్పాట్లు

- నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వీ జయరాం

· 7లో

రాంకీ, ఫార్మా యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలి

- మా జీవనోపాధిని దెబ్బ తీస్తున్నారు
- ఎస్పీకి ముత్యాలమ్మపాలెం గ్రామస్థుల వినతి

తాడి గ్రామస్థులకు రక్షిత తాగునీరు సరఫరా



రక్షిత తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న జోనల్ కమిషనర్ వి.అయ్యప్పనాయుడు, తదితరులు

పరవాడ, జూలై 2 : ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామానికి రక్షిత తాగునీటి సరఫరాను అనకాపల్లి జోనల్ కమిషనర్ వి.అయ్యప్పనాయుడు మంగళవారం ప్రారంభించారు. గ్రామానికి తాగునీరు సరఫరా చేయాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ (ఎన్‌జీటీ) ప్రభుత్వాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాల మేరకు జోనల్ కమిషనర్‌తో పాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పీవీ ముకుందరావు తాడి గ్రామంలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. ఒక్కొక్క కుటుంబానికి ప్రతి రోజు 20 లీటర్ల తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా తాడి, చినతాడి, తాడి కాలనీలకు ప్రతి రోజు ఒక్కొక్క ఇంటికి 20 లీటర్ల చొప్పున తాగునీరును ఉచితంగా సరఫరా చేయనున్నట్టు జోనల్ కమిషనర్ వెల్లడించారు. రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు జడ్సీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఫార్మా బల్క్ డ్రగ్స్ అసోసియేషన్ ప్రతినిధులు సుబ్బారావు, రామేశ్వరరావు, స్థానిక నాయకులు కోమటి సూరిబాబు, గనిరెడ్డి కనకరాజు, సాలాపు రమణ, గుమ్మాల రాము తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

పాముకాటుతో వ్యక్తి మృతి

నర్సీపట్నం, జూలై 2: పురపాలక సంఘం బలిఘట్టంలో పాము కాటుతో వ్యక్తి మృతి చెందాడు. పట్టణ ఎస్సై ఉమామహేశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బలిఘట్టం బీసీ కాలనీకి చెందిన అనకాపల్లి శ్రీనివాసరావు (45) సోమవారం రాత్రి 11.30 గంటలకు గ్రామ శివారులో బహిర్భూమి వెళ్లగా పాము కాటు వేసింది. వెంటనే ఆస్పత్రికి తీసుకు వెళ్లకుండా నిర్లక్ష్యం చేశారు. మంగళవారం ఉదయం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్య సేవలు పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. మృతిడి భార్య అనకాపల్లి రత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

- బంగారం, నగదు స్వాధీనం
- నిందితుడిది ఏపీలోని అనకాపల్లి జిల్లా

మట్టెవాడ, జూలై 2: జల్సాలకు అలవాటు పడి, మద్యానికి, పేకాటకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్టు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏసీపీ విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ రాష్ట్రం అనకాపల్లి జిల్లా, కోటవురట్ల మండలం రామచంద్రపాలెంనకు చెందిన కనక రాజబాబు మద్యానికి, జల్సాలకు అలవాటు పడి 20 దొంగతనాలు చేసి, జైలుకు సైతం వెళ్లాడన్నారు. అయినా అతడిలో మార్పు రాలేదని, జూన్ 23న కాశీబుగ్గలోని వివేకానంద కాలనీలోని రెండు ఇళ్లలో, వరంగల్ బస్టాండ్‌లో దొంగతనానికి పాల్పడినట్టు పేర్కొన్నారు. వివేకానందకాలనీలో రెండు ఇళ్లల్లో చోరీకి పాల్పడి రూ.5 లక్షల నగదు, 10తులాల బంగారు ఆభరణాలు దొంగిలించినట్టు వెల్లడించారు. మంగళవారం చోరీ డబ్బులతో హైదరాబాద్ వెళ్లే క్రమంలో వరంగల్ బస్టాండ్‌లో రాజబాబు తిరుగుతుండగా పట్టుకున్నామన్నారు. అతడి నుంచి రూ.9లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు స్వాధీనపర్చుకున్నట్టు ఏసీపీ వివరించారు. కేసును ఛేదించిన సీఐ మచ్చా శివకుమార్, ఎస్ఐ వెంకన్న, క్రైమ్ పార్టీ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, శివ, ఉపేందర్, రాజశేఖర్‌లను ఏసీపీ అభినందించి రివార్డులను అందజేశారు.

ఇసుక అక్రమంగా తరలించేందుకు యత్నాలు

- అడ్డుకున్న స్థానికులు..
- గస్తీ ఏర్పాటు చేస్తున్నాం : సీఐ

నక్కపల్లి, జూలై 2 : నక్కపల్లి ఇసుక డిపో వద్ద వున్న వేలాది టన్నుల ఇసుకను అక్రమంగా తరలించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారంటూ మంగళవారం రాత్రి స్థానికులు, ట్రాక్టర్ యజమానులు ఆరోపించారు. కొంతమంది వ్యక్తులు మంగళవారం ఉదయమే విజయవాడ నుంచి రెండు కార్లలో నక్కపల్లి ఇసుక డిపో వద్దకు వచ్చినట్టు స్థానికులు చెబుతున్నారు. అయితే ఎస్.రాయవరం మండలం నుంచి ఒక ఎక్స్‌కవేటర్ సాయంతో ఇసుక డిపో వద్ద ఒక బాట ఏర్పాటు చేసి, ఇసుకను తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని పలువురు ఆరోపించారు. ఇసుక తరలింపునకు తమకు అనుమతులు వున్నాయని విజయవాడకు చెందిన వ్యక్తులు చెప్పి, ఇసుక తరలించేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ఈలోగా విషయం తెలిసి సీఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకున్నారు. ఇసుకపై ప్రభుత్వం నూతన పాలసీ ఇచ్చే వరకూ ఇక్కడ సిబ్బందిని గస్తీ పెడుతున్నట్టు సీఐ చెప్పారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో విజిలెన్స్, మైన్స్ విభాగం అధికారులు కూడా వచ్చి ఇక్కడ ఇసుక డిపోను పరిశీలించారు.

బీజేపీ ఆర్టిజన్ సెల్ జిల్లా కన్వీనర్‌గా పవన్

కొత్తూరు, జూలై 2 : భారతీయ జనతా పార్టీ ఆర్టిజన్ సెల్ అనకాపల్లి జిల్లా కన్వీనర్‌గా కాసర్ల పవన్ నియామకమయ్యారని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టిజన్ సెల్ కో-కన్వీనర్లుగా గానుగుల బాబ్జీ, తంగేటి సత్యనారాయణలను నియమించామన్నారు. ఈ మేరకు వారికి నియామక పత్రాలు ఆయన అందజేశారు.

1,400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

పాయకరావుపేట రూరల్, జూలై 2 : పాయకరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది మంగళవారం మండలంలోని గోపాలపట్నం గ్రామ శివార్లలో 1,400 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.ధర్మారావు తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ హెచ్‌సీ ఎం.శంకరరావు, కానిస్టేబుళ్ళు జి.లోవరాజు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో సబ్బవరం ప్రథమం

సబ్బవరం, జూలై 2 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీలో జిల్లాలోనే సబ్బవరం మండలం మొదటి స్థానంలో నిలిచింది. ఎంపీడీవో మహేశ్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది 1న సోమవారం ఉదయం 6 గంటలకు ప్రారంభించిన పింఛన్ల పంపిణీ రాత్రి 8 గంటల వరకూ సాగింది. 97 శాతం పింఛన్లు అందజేశారు. అనకాపల్లి, విశాఖపట్నం ప్రాంతాల్లో వివిధ అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పింఛన్‌దార్లకు మంగళవారం అక్కడకి వెళ్లి మరీ అందజేశారు. సబ్బవరంలో అన్ని రకాల పింఛన్లు 8238 (రూ.5,43,54,500) ఉండగా 99.49 శాతం 8196 మందికి (రూ.5,40,78,500) పింఛన్లు అందించారు. మిగిలిన 42 మందిలో 28 మంది మృతి చెందగా, మరో 14 మంది అందుబాటులో లేకపోవడం వల్ల ఇవ్వలేదని ఎంపీడీవో తెలిపారు.

బీసీ హాస్టల్‌లో తల్లి కోసం మొక్క కార్యక్రమం

కొత్తూరు, జూలై 2 : అనకాపల్లి పట్టణంలోని గాంధీనగరం బీసీ హాస్టల్ ప్రాంగణంలో తల్లి కొరకు ఒక మొక్క కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని హాస్టల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఒక మొక్కని వేయాలని మన తల్లిని గుర్తుంచుకొని తల్లి కోసం ఒక మొక్కని ప్రతి ఒక్కరూ నాటాలని కోరారు. ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర అచ్చంనాయుడు, అంబేద్కర్ మండల అధ్యక్షుడు నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శ్రీను, బీజేపీ నేత బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూరి జగన్నాథ రథయాత్ర ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, జూలై 2: పూరి జగన్నాథ రథయాత్ర ఉత్సవాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా జరిగే గుండిచా యాత్ర, బహుదా యాత్ర, సునాబేషలకు వెళ్లేవారికి ఈనెల 6వ తేదీ నుంచి రైళ్లను అందుబాటులో తెస్తున్నామన్నారు.

విశాఖ- పూరి- విశాఖ

08347 నంబరు గల రైలు ఈనెల 6, 14, 16 తేదీల్లో మధ్యాహ్నం 2.00 గంటలకు విశాఖలో బయలుదేరి రాత్రి 10.45 గంటలకు పూరి చేరుతుంది. తిరిగి ఈనెల 8, 16, 18 తేదీల్లో తెల్లవారుజాము 1.45 గంటలకు పూరిలో బయలుదేరి 10.30 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, సిగడాం, పొందూరు, శ్రీకాకుళం రోడ్డు, తిలారి, కోటబొమ్మాళి, నౌపడ, పలాస, మందస, సోంపేట, ఇచ్ఛాపురం, బ్రహ్మపూర్, ఛత్రపూర్, గంజాం, కాలికోటే, బలుగాన్, కలుపురఘాట్, నిరాకర్‌పూర్, ఖైవదార్‌రోడ్డు, అర్గుల్, హరిపుర్‌గ్రామ్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

గుణుపూర్, పలాస, జగదల్‌పూర్, పూరి మధ్య...

08345 నంబరు గల రైలు ఈనెల 6, 14, 16న రాత్రి 11.00 గంటలకు గుణుపూర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 4.15 గంటలకు పూరి చేరుతుంది. తిరిగి ఈనెల 7, 15, 17న రాత్రి 9.20 గంటలకు పూరిలో బయలుదేరి మర్నాడు ఉదయం 7.30 గంటలకు గుణుపూర్ చేరుతుంది. ఈ రైళ్లకు మార్గంలోని అన్ని స్టేషన్లలో హాల్ట్ ఉంటుంది. 08331 నంబరు గల రైలు ఈనెల 7, 15, 17న 00.15 గంటలకు (ఆయా తేదీల ముందురోజు అర్ధరాత్రి 12.15) పలాసలో బయలుదేరి ఉదయం 5.35 గంటలకు పూరి చేరుతుంది. తిరిగి ఈనెల 8, 16, 18న ఉదయం 4.00 గంటలకు పూరిలో బయలుదేరి 10.05 గంటలకు పలాస చేరుతుంది. ఈ రైళ్లకు మార్గంలోని అన్ని స్టేషన్లలో హాల్ట్ ఉంటుంది. 08349 నంబరు గల రైలు ఈనెల 6, 14, 16న ఉదయం 10. 45 గంటలకు జగదల్‌పూర్‌లో బయలుదేరి అర్ధరాత్రి 12.45 గంటలకు పూరి చేరుతుంది. తిరిగి ఈ రైలు 8, 16,18న 00.15 గంటలకు పూరిలో బయలుదేరి మధ్యాహ్నం 3.10 గంటలకు జగదల్‌పూర్ చేరుతుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

కృష్ణాదేవిపేటలో అల్లూరి జయంతికి ముమ్మర ఏర్పాట్లు

- నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వీ జయరాం



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డీవో జయరాం

కృష్ణాదేవిపేట, జూలై 2: విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని కృష్ణాదేవిపేట అల్లూరి స్మృతివనం వద్ద ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు నర్సీపట్నం డివిజనల్ రెవెన్యూ అధికారి హెచ్‌వీ జయరాం తెలిపారు. మంగళవారం ఆర్డీవో జయరాం గొలుగొండ మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో జయంతికి చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా పార్కును పరిశీలించి పార్కు ముఖద్వారం, విగ్రహాలు, ఆవరణలో రంగులు, ముగ్గులు వేయించాలని ఆదేశించారు. అలాగే అల్లూరి జయంతి రోజున నాలుగు మండలాల నుంచి విద్యార్థులు అల్లూరి వేషధారణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కృష్ణాదేవిపేట రామాలయం నుంచి విద్యార్థులతో ప్రారంభకానున్న భారీ ర్యాలీకి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అల్లూరి పార్కులో ఈ నెల 4న జయంతి కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, గాజువాక ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. వీరందరి రాకకు అనుకూలంగా సభా వేదిక, పరిసరాలు పరిశుభ్రత, భద్రత వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, జిల్లా ట్రైబుల్ వెల్ఫేర్ అధికారి వి.నాగశిరీష, నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి, కృష్ణాదేవిపేట రేంజర్ సుంకర వెంకటరావు, కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర, ఈవోపీఆర్డీ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌భరత్, పలు శాఖలు జేఈఈలు అరుణకుమారి, రాజేంద్రప్రసాద్, సుదీసన, ఆర్ఐలు నాగరాజు, నారాయణరావు, కొడబాబు, కార్యదర్శిలు శ్రీనివాస్, రఘు, రాజేష్, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, పెట్ల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాంకీ, ఫార్మా యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలి

- మా జీవనోపాధి దెబ్బ తీస్తున్నారు
- ఎస్పీకి ముత్యాలమ్మపాలెం గ్రామస్థుల వినతి



జిల్లా ఎస్పీ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ముత్యాలమ్మపాలెం మత్స్యకారులు

పరవాడ, జూలై 2: ఫార్మా వ్యర్థ రసాయనాలను నేరుగా సముద్రంలోకి విడిచిపెట్టి మత్స్యసంపద మృతికి కారణమవుతున్న రాంకీ, ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలపై తగు చర్యలు చేపట్టాలని ముత్యాలమ్మపాలెం గ్రామస్థులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్ని దశాబ్దాలుగా ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారులంతా సముద్ర వేటపై ఆధారపడి జీవిస్తున్నారని, ఫార్మా పరిశ్రమల స్థాపన తరువాత యాజమాన్యాలు వ్యర్థ రసాయనాలను సముద్రంలోకి విడిచిపెట్టడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ జీవనోపాధి దెబ్బతిందన్నారు. ఇటీవల ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో ఫార్మా వ్యర్థజలాలు కలవడంతో భారీ ఎత్తున చేపలు మృతి చెందినట్లు తెలిపారు. అలాగే రాంకీ యాజమాన్యం ఫార్మాసిటీ నుంచి తిక్కవానిపాలెం తీరం వరకు వ్యర్థ జలాల పైపులైన్ ఏర్పాటు చేసిందని వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా పైపులైన్ ద్వారా సముద్రంలోకి విడిచిపెట్టడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. ఈ విషయమై 2012లో ఆమరణ నిరాహారదీక్ష చేయడంతో అప్పటి జిల్లా కలెక్టర్ స్పందించి రాంకీ యాజమాన్యంతో చర్చలు నిర్వహించినట్లు తెలిపారు. చర్చల్లో భాగంగా 500 మంది మత్స్యకారులకు శాశ్వత ఉపాధి కల్పిస్తామని ఫ్యాక్టరీ యాజమాన్యం అగ్రిమెంట్ కూడా చేసినట్టు వెల్లడించారు. అయితే 12 ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఉపాధి కల్పించలేదని వాపోయారు. దీనిపై తక్షణమే కలగజేసుకుని మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే కలెక్టరేట్‌లోని అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చింతకాయల అమ్మోరు, మత్స్యకార నాయకులు అర్జిల్లి రవి, సూరాడ ముత్యాలరావు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట డ్వాక్రా మహిళల ధర్నా

- డ్వాక్రా నిధులు కాజేసిన అధికారులపై చర్యలకు డిమాండ్



డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డ్వాక్రా మహిళలు

అనకాపల్లి టౌన్, జూలై 2: డ్వాక్రా మహిళల నిధులు కాజేసిన అధికారులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట డ్వాక్రా మహిళలు ధర్నా చేశారు. మండలంలోని సత్యనారాయణపురం, కొత్తూరు, మూలపేట పంచాయతీల్లో నకిలీ డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి బ్యాంకు రుణాలను కాజేసిన వెలుగు, బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ సంఘటన జరిగి ఆరు నెలలు అయిందని, అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఎనిమిది కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. దోషులను కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ సత్యనారాయణపురం, కొత్తూరు పంచాయతీల్లో వీవోఏ గ్రూపు సభ్యులకు తెలియకుండానే నకిలీ గ్రూపులను ఏర్పాటు చేసి రూ.ఎనిమిది కోట్ల రూపాయలకు అవినీతికి పాల్పడ్డారన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి డీడీ వరలక్ష్మి మాట్లాడుతూ ఇంత పెద్ద అవినీతి వ్యవహారం జరుగుతున్నా దీనిని పర్యవేక్షించాల్సిన మండల ఏపీఎం, సీసీలు సిబ్బందిని సస్పెండ్ చేసి చేతులు దులుపుకుందని ఆరోపించారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, డ్వాక్రా మహిళలు జి. సుభాషిణి, నాగమణి, ఉప్పాక లక్ష్మి, బోడి ఝాన్సీ, బొబ్బిలి గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

- కొన్నెంపూడిలో ఐదుగురికి జ్వరాలు



కొన్నెంపూడిలో రోగులను తనిఖీ చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ పేరునాయుడు

చీడికాడ, జూలై 2: మండలంలోని కొన్నెంపూడి, కోనాం గ్రామాల్లో రెండు రోజులుగా చీడికాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. సోమవారం కొన్నెంపూడి గిరిజన గ్రామంలో 18 మందికి హెల్త్‌అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు తనిఖీచేయగా, కాదరి దేముడు, బోలం గీత, కోట కొండబాబు, పాడి హర్షవర్ధన్, బొర్రబోయిన దుర్గ ఐదుగురు జ్వరంతో బాధపడుతున్నట్టు గుర్తించారు. వీరందరికీ రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీచేశారు. ఈ శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ జి. వెంకటరావు, ఆశవర్కర్లు పాల్గొన్నారు. మంగళవారం కోనాంలో ఫ్యామిలీఫిజీషియన్‌లో భాగంగా వైద్య శిబిరం జరిగింది. 35మందికి తనిఖీలు చేసి మందులు అందించారు. ఈ శిబిరంలో చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్, వైద్య సిబ్బంది పేరునాయుడు, మొల్లి వరలక్ష్మి, రాజేశ్వరి సేవలందించారు.

జూ పార్కుకు కొత్త అతిథులు

- నేడు గుజరాత్ నుంచి రాక

ఎంవీపీ కాలనీ/ఆరిలోవ, జూలై 2: నగరంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల, గుజరాత్‌లోని జామ్‌నగర్ గ్రీన్స్ జూలాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ మధ్య జంతు మార్పిడి పథకం ద్వారా కొత్త ప్రాణులను విశాఖ తీసుకురానున్నారు. జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపిన వివరాల ప్రకారం... గుజరాత్‌లోని రాధే కృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖ జూ పార్కుకు ఆకుపచ్చ రెక్కల మకావ్, స్కార్లెట్ మకావ్, మిలిటరీ మకావ్, మీడియం సల్ఫర్ కకాటూ, స్లెండర్ టెయిల్డ్ మీర్కట్, రెడ్ నేక్డ్ వల్లబీ, స్క్విరల్ మంకీ రానున్నాయి. వీటికి బదులు ఇక్కడి నుంచి హైనా, హాగ్ డీర్, పెయింటెడ్ స్టార్క్, గ్రె పెలికాన్, స్టార్ టార్టాయిస్, ఘరీయల్, జంగిల్ క్యాట్, ధోలే, తోడేలు, గౌర్ వంటి 49 రకాల పక్షులు, ఇతర జంతువులను అందిస్తున్నారు. బుధవారం విశాఖ రానున్న ప్రాణులను కొద్దిరోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచి, పరీక్షించిన అనంతరం సందర్శకులు వీక్షించేందుకు వీలుగా ఎన్‌క్లోజర్లలో ఉంచుతామని క్యూరేటర్ తెలిపారు.

ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించిన డీఈవో



శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

చోడవరం, జూలై 2: స్థానిక జెడ్పీబాలికల హైస్కూల్‌లో చోడవరం, మాడుగుల, పెందుర్తి నియోజకవర్గాలకు చెందిన ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న టీచ్‌టు టూల్ శిక్షణ శిబిరాన్ని మంగళవారం డీఈవో వెంకటలక్ష్మమ్మ సందర్శించారు. శిబిరంలో శిక్షణతీరును ఆమె పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు జయలక్ష్మి, సింహాచలం, సమగ్రశిక్ష అధికారులు పాల్గొన్నారు.

శకుంతలాదేవి గణిత క్లబ్ అధ్యక్షునిగా దుర్గాప్రసాద్

కశింకోట, జూలై 2 : శకుంతలాదేవి గణిత క్లబ్ అధ్యక్షుడిగా పాలా దుర్గాప్రసాద్ నియమితులయ్యారని వెదురుపర్తి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం జీవీకే.ఆచారి తెలిపారు. మంగళవారం స్థానిక పాఠశాలలో జరిగిన నూతన కార్యవర్గం నియమించి క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యదర్శిగా పావని పరమేశ్వరి మరో ఆరుగురు సభ్యులను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఏవీఎన్.మూర్తి, పి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన చేసుకోవాలి

కశింకోట,జూలై 2: కొత్త చట్టాలపై ప్రజలంతా అవగాహన పెంపొందించుకోవాలని కశింకోట ఏఎస్ఐ కణితి రమణి అన్నారు. మంగళవారం కశింకోటలోని పలు పురవీధుల్లో ప్రజలకు ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. గతంలో ఇండియన్ పీనల్ కోడ్‌లో 511 చట్టాలు ఉండేవని, వాటిని తాజాగా భారతీయ న్యాయ సన్నిహిత చట్టం కింద 358 చట్టాలుగా రూపకల్పన చేశారని వివరించారు. ప్రజలు, మహిళలకు ఎటువంటి అన్యాయం జరిగినా శిక్షలు వెంటనే అమలు చేసే విధంగా చట్టాలు రూపొందించారని తెలిపారు. పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే బాధితులకు న్యాయం జరుగుతుందని, తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకునే అవకాశం లేదన్నారు.

సమష్టి కృషితోనే కూటమి విజయం

- టీడీపీ మండల అధ్యక్షుడు అబద్దం

ఎస్.రాయవరం, జూలై 2 : గ్రామ స్థాయి నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, శ్రేణులంతా కష్టపడి పనిచేయడం వల్లే పాయకరావుపేట నియోజకవర్గంలో వంగలపూడి అనిత అత్యధిక మెజారిటీతో విజయం సాధించారని టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం పేర్కొన్నారు. సోమవారం రాత్రి ధర్మవరం అగ్రహారంలో టీడీపీ మండల యూత్ అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అబద్దంతో పాటు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ, పల్లెల జగ్గారావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యం, నాయకులు సియ్యాదుల అచ్యుత్‌కుమార్, బండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చెర్లలో ఘనంగా తుంపాలమ్మ తల్లి పండగ

- దర్శించుకున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



తుంపాలమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట, జూలై 2: మండలంలోని అచ్చెర్ల గ్రామంలో తుంపాలమ్మతల్లి పండగ మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టు పక్కల పరిసరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఎంపీటీసీ మాజీ సభ్యుడు దొడ్డి నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు నైనంశెట్టి రమణారావు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని ప్రత్యేక పూజలు చేశారు. కాగా మధ్యాహ్నం భక్తులు అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకువెళ్ళారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కర్రి సత్యనారాయణ, నిమ్మదల సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు వెండి విష్ణుచక్రం బహూకరణ



అమ్మవారికి బహూకరించిన వెండి విష్ణుచక్రం

మాడుగుల రూరల్, జూలై 2: మండలంలోని ఎం.కోడూరులోని మోదకొండమ్మ అమ్మవారికి మంగళవారం దాతలు కిలో 250 గ్రాముల వెండి విష్ణు చక్రం ఆభరణాన్ని బహూకరించారు. గ్రామానికి చెందిన పడాల అప్పలనరసయ్య, కాత్రకోట పద్మ, రాజకుమార్ తయారు చేయించి ఇచ్చిన విష్ణుచక్రాన్ని అమ్మవారికి అలంకరించినట్టు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు తెలిపారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

పాయకరావుపేట, జూలై 2: ఈ ఏడాది నిర్వహించిన నీట్‌తో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం దేశవ్యాప్తంగా జరిగే కేజీ టు పీజీ విద్యా సంస్థల బంద్‌ను విజయవంతంచేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.జగదీశ్, జిల్లా కార్యదర్శి ఎం.రమణ పిలుపునిచ్చారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ అయిందని, దీనిలో దోషులుగా ఉన్నవారు ఒక్కో విద్యార్థి నుంచి రూ.30 నుంచి రూ.40 లక్షలు వసూలు చేశామని చెబుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పేపర్ లీక్‌కు బాధ్యులైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని, నీట్ పరీక్షను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేయతలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ నాయకులు ఏసు, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలను అదుపు చేయాలి

- జిల్లా కలెక్టర్‌ను కోరిన సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి టౌన్, జూలై 2: జిల్లాలో విజృంభిస్తున్న విషజ్వరాలు అదుపు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం జిల్లా కలెక్టర్‌ను ఒక లేఖలో కోరారు. జిల్లాలో ప్రధానంగా గొలుగొండ, నాతవరం, రోలుగుంట, రావికమతం, వి.మాడుగుల మండలాల్లోని ఏజెన్సీకి ఆనుకుని ఉన్న గ్రామాల్లో జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు వెంటాడుతున్నాయన్నారు. దీనివల్ల దోమలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. పంచాయతీల్లో నిధులు కొరత మూలంగా బ్లీచింగ్ పౌడరు, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదన్నారు. పారిశుధ్య కార్మికులు కొరత కూడా ఉందన్నారు. దీనివల్ల పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వానంగా మారిందన్నారు. జ్వరాలు ప్రబలుతున్న గ్రామాలను గుర్తించి ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు లోకనాథం తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్లల్లో మలేరియా పరీక్షా కిట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరినట్లు తెలిపారు.

డిగ్రీలో ప్రవేశాలకు 10వ వరకూ గడువు

నక్కపల్లి, జూలై 2: నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 10లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నక్కపల్లి డిగ్రీ కళాశాలలో బీఏ ఆనర్స్ (హిస్టరీ), బీకాం ఆనర్స్ (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ ఆనర్స్ (బాటనీ), బీఎస్సీ మ్యాథ్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. అన్ని కోర్సులకు కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ మైనర్ సబ్జెక్టులుగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులకు ఉపకార వేతనాలతో పాటు, ఫీజు రీ-ఎంబర్స్‌మెంట్ వంటి పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం నక్కపల్లి డిగ్రీ కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సెజ్ కాలనీలో స్పోర్ట్స్ హబ్ : ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం రూరల్, జూలై 2 : సెజ్ పునరావాస కాలనీ దిబ్బపాలెంలో స్పోర్ట్స్ హబ్ కోసం స్థలం ఏర్పాటు చేయనున్నట్లు యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తెలిపారు. మండలంలోని సెజ్ పునరావాస కాలనీలో క్రీడా హబ్ స్థల సేకరణ కోసం మంగళవారం స్పోర్ట్స్ అధికారి రమణ, మండల అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. యువతకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. క్రికెట్ మైదానం, షటిల్ కోర్టు, బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టు


స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

వంటివి ఒకే చోట ఉండేలా స్థలం ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో మండల ప్రజలకు వినియోగంలోకి తీసుకుని రావడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట దిబ్బపాలెం కాలనీ నాయకులు బైలపూడి రామదాసు, రాజాన విజయ్, అడిగర్ల దేముడు తదితరులు ఉన్నారు.

వణికిస్తున్న వైరల్ జ్వరాలు

- సీహెచ్‌సీకి రోగుల తాకిడి
- విజృంభిస్తున్న టైఫాయిడ్, వైరల్ జ్వరాలు
- మునిసిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ లోపం

ఎలమంచిలి, జూలై 2 : ఎలమంచిలి సీహెచ్‌సీకి వైరల్, టైఫాయిడ్ జ్వరాల రోగుల తాకిడి పెరుగుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు మునిసిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ చర్యలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో దోమలు వ్యాప్తి చెందిన ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇటీవల కొన్ని రోజులుగా ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతి రోజూ 20 నుంచి 30 వరకూ వైరల్ జ్వరాలతో రోగులు ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మంగళవారం ఎలమంచిలి సీహెచ్‌సీలో టైఫాయిడ్ జ్వరంతో పెదపల్లి వార్డుకు చెందిన ఏడాది చిన్నారి ఆశ్రిత ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతుంది.


సీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న రోగులు

అలాగే మునిసిపాలిటీలోని పలు వార్డులకు చెందిన టైఫాయిడ్ రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. పట్టణంతో పాటు విలీన వార్డుల్లో కనీసం బ్లీచింగ్ పిచికారీ పనులు చేపట్టడం కూడా లేదని స్థానికులు మండిపడుతున్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నా, వర్షాలు కురుస్తున్నా సరే మునిసిపల్ అధికారులు మాత్రం ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైరల్ జ్వరాలు తీవ్రత మరింత విజృంభించక ముందే ప్రజారోగ్య శాఖ అధికారులు బ్లీచింగ్ పిచికారీ, ఫాగింగ్ చేయడంతో పాటు తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జగన్నాథ రథయాత్రకు ఘనంగా ఏర్పాట్లు


ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, జూలై 2 : స్థానిక ఇంద్రజ్యుమ్న హాలులో కొలువుదీరనున్న సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి రథయాత్ర ఏర్పాట్లను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ నెల ఏడో తేదీన జగన్నాథ రథయాత్ర నేపథ్యంలో స్థానిక గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్న హాలులో జరిగే నవరాత్రుల సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తక్షణమే ఉత్సవానికి అవసరమయ్యే ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఈ ఏడాది ఈ ఉత్సవం అయిన వెంటనే ఇంద్రజ్యుమ్న హాలు ప్రాంతంలో కల్యాణ మండపం నిర్మించి ఈ ప్రాంతవాసులకు, జగన్నాథస్వామి పండుగకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేస్తామని ఎమ్మెల్యే కొణతాల పేర్కొన్నారు.ప్రణాళికాబద్ధంగా ఈప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జగన్నాథస్వామి ఆలయ ఈవో రాజా సులోచన, అర్చకులు బి.సత్యనారాయణ, జనసేన నాయకుడు పి.నాగశ్రీను పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎలమంచిలి, జూలై 2 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ చేపట్టాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎలమంచిలి సీహెచ్‌సీని సందర్శించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొక్కల పెంపకంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌వో శ్రీనివాసరావు, ఆస్పత్రి వైద్యులు నీహారిక, వైద్య సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సుందరపు

అతిసార నివారణపై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

కోటవురట్ల, జూలై 2 : ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందుకు ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కె.వెంకటాపురం పీహెచ్‌సీ డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. మంగళవారం కోటవురట్లలో వైద్య, ఆరోగ్య శాఖ ఆరోగ్య సిబ్బంది అతిసార నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా అతిసార విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండి, వ్యాధి లక్షణాలు కనిపిస్తే సకాలంలో వైద్యులు సంప్రదించి వైద్యసేవలు పొందాలన్నా రు. కాచిన నీరు, వేడి పదార్థాలు, గోరు వెచ్చని తాగు నీరు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఆరోగ్య శాఖ సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో గోవిందరావు, డేవియల్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సొసైటీ ఓటర్ల జాబితా పరిశీలన

నక్కపల్లి, జూలై 2 : త్వరలో జరగనున్న మత్స్యకార సొసైటీల ఎన్నికలకు సంబంధించి మత్స్యకార గ్రామాల్లో ఓటర్ల ఆన్‌లైన్ వెరిఫికేషన్ ప్రక్రియ మంగళవారం నుంచి మొదలైంది. రాజయ్యపేటలో ఫిషరీస్ ఏడీ త్రినాథ్, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు పిక్కి కోదండరావు ఆధ్వర్యంలో సచివాలయంలో మత్స్యకార సొసైటీ ఓటర్ల ఆన్‌లైన్ పరిశీలనను అధికారులు చేపట్టారు. పాత ఓటర్లు ఒక ఫొటో, ఆధార్ జెరాక్స్‌లను పరిశీలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పిక్కి సత్తియ్య, పిక్కి గంగరాజు, బొంది బాబూరావు, మద్దు జోగిరాజు, వాసుపల్లి అప్పారావు, పిక్కి కోదండరావు, బొంది గుర్రన్న పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలకు దాడి వీరభద్రరావు దూరం

కొత్తూరు, జూలై 2 : ఈ నెల 3న తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసేందుకు రావద్దని అభిమానులు, శ్రేయోభిలాషులు, టీడీపీ శ్రేణులకు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం అనకాపల్లిలో తాను ఉండడం లేదని తెలిపారు. కొన్ని దశాబ్దాలుగా తనకు రాజకీయ రంగంలో ప్రోత్సాహాన్ని అందిస్తున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, మిత్రులందరికీ తాను రుణపడి ఉన్నానని తెలియజేస్తూ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రోటరీ నేత్ర వైద్యశాలలో 8 మందికి శస్త్రచికిత్సలు



అనకాపల్లి టౌన్, జూలై 2 : స్థానిక ఏఎంఏఎల్ రోటరీ నేత్ర వైద్యశాలలో ఎనిమిది మంది నిరుపేదలకు మంగళవారం ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించారు. గత నెల 24న 41 మంది కంటి పరీక్షలకు హాజరు కాగా, నేత్ర వైద్య సహాయకులు పి.దేవి పరీక్షలు నిర్వహించి ఎనిమిది మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. దీంతో మంగళవారం డాక్టర్ కె.మల్లేశ్వరరావు శస్త్రచికిత్సలు చేపట్టారు. రోటరీ ప్రతినిధులు సారిపల్లి రాజేష్, అనిల్ రోగులకు ఐదు రోజులకు సరిపడా మందులను ఉచితంగా అందజేయడం జరిగిందని కంటి ఆస్పత్రి చైర్మన్ రవిరాం జవహర్ తెలిపారు.

గెడ్డ ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కొత్తూరు, జూలై 2 : అనకాపల్లి మండలం మామిడిపాలెం గ్రామ సర్వే నంబరు 74/18లో ఉన్న సుమారు 26 సెంట్ల గెడ్డకు చెందిన గయాళ్ల భూమి స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని వెంటనే అడ్డుకొని విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన బంధం మహాలక్ష్మినాయుడు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, అనకాపల్లి తహశీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి లారీలతో మట్టి నింపి గెడ్డ స్థలంలో నిర్మాణాన్ని ప్రారంభించారన్నారు. దీనివల్ల గెడ్డలోని నీరు నివాసాలపై వచ్చే ప్రమాదముందన్నారు. తమ నివాసాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు.

స్థానికులు చెప్పినా వినకుండా స్థలాన్ని ఆక్రమించి, మట్టి నింపి, నిర్మాణాన్ని చేపట్టారని వాపోయారు. దీనిపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విచారణను బట్టి స్థలాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. గెడ్డవాగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. నివాసాలను ముంపునకు గురి కాకుండా రక్షించాలని కోరారు. లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయస్థానాలను ఆశ్రయిస్తానని చెప్పారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య'

పాయకరావుపేట, జూలై 2 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం కృషిచేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. మంగళవారం ఇందిరాకాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబుతో కలిసి విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం చిట్టిబాబు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది పేద పిల్లలకు ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీనుతో పాటు నాయకులు పల్లా విలియంకేరి, జూరెడ్డి ప్రసాద్, కశింకోట సత్తిబాబు, సలికే


పుస్తకాలు అందజేస్తున్న చిట్టిబాబు తదితరులు

రమణ, గంపల చినరాజుతో పాటు జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, ఇంజరపు సూరిబాబు, శివలంక నాగమల్లి, బీజేపీ నాయకులు కువల కుమార్ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి అభినందన

అచ్యుతాపురం రూరల్, జూలై 2 : ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు తలపెట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అందించిన ఎన్‌టీఆర్ భరోసా ద్వారా సామాజిక పింఛన్లను అందజేసిన సచివాలయ సిబ్బందిని మంగళవారం గ్రామ టీడీపీ నాయకులు అభినందించారు. ఎన్డీయే ప్రభుత్వ పాలన ఎంత జనరంజకంగా సాగుతుందో చెప్పడానికి పింఛన్ల పంపిణీ తీరు అద్దం పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి నగేష్, గొంప నరసింహనాయుడు, రెడ్డి శ్రీను, కన్నూరు ఎర్నాయుడు, రెడ్డి అప్పారావు, రెడ్డి దేముడు, గడ్డం రాజు, లాలం రమణబాబు, రెడ్డి నాయుడు బాబు, వై.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యలోనూ ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

కొన్ని కాలేజీల యాజమాన్యాలు యత్నిస్తున్నాయి.

స్టడీ సెంటర్లకు ఎగనామం

ప్రతి అవసరానికి ఏయూలోని దూర విద్యా కేంద్రానికి రావడం విద్యార్థులకు ఇబ్బంది అవుతుంది. దీనిని దృష్టి ఉంచుకుని దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో గతంలో ఇటు శ్రీకాకుళం జిల్లా నుంచి అటు గుంటూరు జిల్లా వరకు పది స్టడీ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ స్టడీ సెంటర్లలో విద్యార్థులకు అవసరమైన సేవలు అందించేలా సిబ్బందిని నియమించారు. అడ్మిషన్ ఇవ్వడం దగ్గర నుంచి ఫీజులు వసూలు, పుస్తకాల పంపిణీ వంటి సేవలను అందించేవారు. అయితే, ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తున్నామని చెప్పి ఈ స్టడీ సెంటర్లను అధికారులు పూర్తిగా ఎత్తేశారు.

బాబోయ్ ప్లాస్టిక్ భూతం

... 5వ పేజీ తరువాయి

అనర్థమని డాక్టర్లు హెచ్చరిస్తున్నా పెడ చెవిన పెడుతున్నారు.

మొక్కుబడిగా తనిఖీలు

ప్రభుత్వం ప్లాస్టిక్ సంచుల వినియోగంపై నిషేధం అమలు చేస్తున్నా సంబంధిత శాఖల అధికారులు మొక్కుబడిగా దాడులు నిర్వహించి కొన్ని కేసులు నమోదు చేసి, మమా అనిపించేస్తున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలితో పాటు మేజర్ పంచాయతీల్లో నిషేధం అమలు అంతంతమాత్రంగానే ఉంది. ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి బయటకు వచ్చాక తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో కూరగాయలు, ఆహార పదార్థాలు, పండ్లు, వస్త్రాలు వంటి అన్ని రకాల వస్తువులను ప్లాస్టిక్ సంచుల్లోనే తీసుకువెళుతున్నారు. నెలావారీ లెక్కల కోసం హడావిడిగా కొన్ని దుకాణాలపై దాడులు చేయడం, కేసులు నమోదు చేసి జరిమానాలు విధించడంతో అధికారులు సరిపుచ్చుతున్నారు. అనకాపల్లి జీవీఎంసీ పరిధిలో 2022 జూలై నెల నుంచి 2022 డిసెంబరు వరకు ప్లాస్టిక్ సంచులు విక్రయదారులపై దాడులు నిర్వహించి 825 కేసులు నమోదు చేశారు. సుమారు 42 కిలోల ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకొని రూ.42 వేలు జరిమానా విధించారు. 2023 జనవరి నెల నుంచి డిసెంబరు వరకు 2,113 కేసులు నమోదు చేసి, 98 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. రూ.1,32,702 జరిమానా విధించారు. 2024 జనవరి నుంచి జూన్ వరకు 250 కేసులు నమోదు చేసి 40 కిలోల సంచులు స్వాధీనం చేసుకున్నారు. రూ.1,55,200 జరిమానా విధించారు. నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల పరిధిలో కూడా కేసులు అంతంతమాత్రంగానే నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. నర్సీపట్నం మునిసిపాలిటీలోని మెయిన్ రోడ్డు, దుకాణాలు, కూరగాయల మార్కెట్లు నుంచి రోజుకి 100 కిలోల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయి. దీనిపై నర్సీపట్నం మునిసిపల్ కమిషనర్ రవిబాబును వివరణ కోరగా 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న పాలిథిన్ సంచులు విక్రయించకూడద ని తెలిపారు.

మునిసిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో హోల్‌సేల్ వర్తకులతో సమావేశం ఏర్పాటు చేసి పాలిథిన్ సంచులు విక్రయించవద్దని చెబుతామన్నారు. ప్లాస్టిక్ సంచుల వినియోగంపై నిషేధం విధించిన ప్రభుత్వం ఆ సంచుల తయారీ సంస్థలపై దాడులు నిర్వహించి, మూయించి వేస్తే అసలు మార్కెట్‌లోకి నిషేధిత ప్లాస్టిక్ సంచులు రావుకదాని పలువురు అభిప్రాయపడుతున్నారు. తయారీ సంస్థలపై ఎటువంటి చర్యలు చేపట్టకుండా ప్లాస్టిక్ సంచుల వినియోగంపై నిషేధం విధించడం ఎంతవరకు సమంజసమని పలువురు వ్యాపారులే ప్రశ్నిస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధం విధించిన ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా గోనె, కాగితంతో తయారు చేసే సంచులను మార్కెట్‌లో అందరికీ అందుబాటు ధరల్లో ఉంచే విధంగా ప్రయత్నాలు చేయకపోవడం కూడా ప్లాస్టిక్ సంచుల వియోగానికి ఒకింత ప్రధాన కారణంగా చెబుతున్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

శివశక్తి క్షేత్రంలో 4 నుంచి అతి రుద్రాభిషేకం



పవన్‌ను ఆహ్వానిస్తున్న కేఎస్ఆర్ శర్మ

నాతవరం, జూలై 2 : నాతవరం మండలం చిక్కుడుపాలెంలో వేంచేసి ఉన్న శివశక్తి క్షేత్రం (భూగర్భ శివాలయం)లో ఈ నెల 4 నుంచి 14 వరకు 300 రకాల ద్రవ్యాలు, 180 నది జలాలతో అతి రుద్రాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కేఎస్ఆర్ శర్మ తెలిపారు. ఈ క్షేత్రం వద్ద ఉచిత సేవలు అందించేందుకు ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని ఈ ఆసుపత్రికి సినీనటుడు సుమన్ శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. అలాగే సోమవారం పిఠాపురంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలసి ఈ క్షేత్రం గురించి వివరించినట్టు చెప్పారు. ఈ క్షేత్రాన్ని దర్శించేందుకు వస్తానని పవన్ చెప్పినట్టు శర్మ వెల్లడించారు.

మైత్రి గ్రంథాలయానికి డిక్షనరీ బహూకరణ

కృష్ణాదేవిపేట, జూలై 2 : స్థానిక అల్లూరి సీతారామ రాజు మైత్రి గ్రంథాలయానికి మంగళవారం జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు నిర్వాహకులకు డిక్షనరీని అందించారు. గ్రంథాలయానికి ఎంతో విలువైన శంకరనారాయణ ఈ డిక్షనరీ తెలుగు, ఇంగ్లీష్, హిందీలో ప్రచురించబడిన డిక్షనరీ హైస్కూల్, డిగ్రీ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని పడాల తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాదేటి రవిప్రకాష్, అల్లూరియువజన సంఘం రాష్ట్ర కార్యదర్శులు లాక్కాకుల బాబ్జి, శ్యామల వరలక్ష్మి, అంబటి వరహాలరాజు, సభ్యులు భాస్కరమణిపాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించండి

నర్సీపట్నం, జూలై 2 : సమగ్ర శిక్ష ఉద్యోగులకు మే, జూన్ నెల జీతాల బకాయిలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పూడి వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అనకాపల్లి జిల్లా సమగ్ర సొసైటీలో 1200 మంది వివిధ విభాగాలలో పని చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగులకు రెండు నెలల జీతం అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే జీతం బకాయిలు మంజూరు చేయాలని కోరారు.

నూతన చట్టాలపై అందరికీ అవగాహన అవసరం

▸▸ వివిధ స్టేషన్ల పరిధిలో పోలీసుల విస్తృత ప్రచారం



కృష్ణాదేవిపేట : కరపత్రాలు అందజేస్తున్న పోలీసులు



గొలుగొండ : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

కృష్ణాదేవిపేట, జూలై 2 : కొత్త చట్టాలపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి కోరారు. మంగళవారంగొలుగొండ మండలం కృష్ణాదేవిపేట, చోద్యం తదితర గ్రామాల్లో కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్రతో కలిసి ప్రజలతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ బి.హరి మాట్లాడుతూ సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ప్రవేశ పెట్టిన కొత్త చట్టాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ఉండే విధంగా లా అండ్ ఆర్డర్ పని చేస్తుందన్నారు. నర్సీపట్నం సర్కిల్ పరిధిలో గల ఎక్కడైనా ఎవరైనా పేకాట, కోడిపందాలు, నాటుసారా తయారీ, విక్రయాలు వంటి అసాంఘికకార్యక్రమాలు నిర్వహిస్తే ప్రజలు పోలీసులకుఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండలో..

గొలుగొండ : కొత్తగా అమలులోకి వచ్చిన చట్టాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని మంగళవారం పలు గ్రామాల్లో ఎస్ఐ కృష్ణారావు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. నూతన చట్టాలపై మండలంలోని జోగంపేట, గొలుగొండ గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా చట్టం ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

వూషూలో పతకాల విజేతలకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న విజయ్

నర్సీపట్నం, జూలై 2 : పదో రాష్ట్ర స్థాయి వూషూ టోర్నమెంట్‌లో బంగారం, కాంస్య పతకాలు సాధించిన నర్సీపట్నం క్రీడాకారులను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మంగళవారం అభినందనలు తెలిపారు. గత నెల 27, 28 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగిన వూషూ టోర్నమెంట్‌లో విత్తనాల లోకేశ్, రాతు నాగలక్ష్మిలు బంగారు పతకాలు, బొమ్మల రాజరాజేశ్వరి, అప్పికొండ వంశీ కాంస్య పతకాలు సాధించారు. క్రీడాకులను విజయ్ అభినందించారు. భవిష్యత్తులో మరింతగా రాణించి నర్సీపట్నానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ యర్రా శేఖర్ పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట అటవీ డిప్యూటీ రేంజ్‌గా అధికారిగా సత్యనారాయణ



కృష్ణాదేవిపేట, జూలై 2 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అటవీ రేంజ్‌కి డిప్యూటీరేంజ్ అధికారిగా సత్యనారాయణ మంగళవారం స్థానిక రేంజ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నర్సీపట్నంలో సెక్షన్ అధికారిగా పని చేస్తున్న ఇతను పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అటవీ సంపద పరిరక్షణ, విధులు పట్ల అంకితభావంతో పనిచేస్తాన్నారు. దీనికి సిబ్బంది, ప్రజలు సహకారం అందించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు

మాకవరపాలెం, జూలై 2 : డయేరియా, మలేరియా వ్యాధ్యులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మాకవరపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీవిద్య, సీతామహాలక్ష్మి కోరారు. మంగళవారం పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో డయేరియా, మలేరియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులు శుభ్రత

మాకవరపాలెం, జూలై 2 : మండలంలో లచ్చన్నపాలెంలో తాగునీటి పథకాలను టీడీపీ నాయకులు పరిశుభ్రం చేశారు. గత కొద్ది నెలలుగా మంచినీటి పథకాలు శుభ్రం చేయకపోవడంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో మంగళవారం టీడీపీ నాయకులు పోతలరాంబాబు, పోతల రాధాకృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న మంచినీటి పథకం శుభం చేసి కోర్లినేషన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పంచాయతీ నిధులు కాజేయడంతో గ్రామాల్లో ఉన్న మంచినీటి పథకాలు కూడా అధ్వానంగా తయారయ్యాయ న్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామంలో స్థానికులతో కలిసి నీటి పథకాలను శుభ్రం చేశామన్నారు.

ఆస్పత్రిలో పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న సత్యవేణి

గొలుగొండ, జూలై 2 : విశాఖ నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జోగంపేట గ్రామానికి చెందిన రుత్తల సత్యనారాయణకు దివ్యాంగుల పింఛన్‌ను ఆర్బీకే అధికారి ఎల్.సత్యవేణి అందించారు. దీంతో సత్యనారాయణ కుటుం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బాబోయ్ ప్లాస్టిక్ భూతం

... 5వ పేజీ తరువాయి

అనర్థమని డాక్టర్లు హెచ్చరిస్తున్నా పెడ చెవిన పెడుతున్నారు.

మొక్కుబడిగా తనిఖీలు

ప్రభుత్వం ప్లాస్టిక్ సంచుల వినియోగంపై నిషేధం అమలు చేస్తున్నా సంబంధిత శాఖల అధికారులు మొక్కుబడిగా దాడులు నిర్వహించి కొన్ని కేసులు నమోదు చేసి, మమా అనిపించేస్తున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలితో పాటు మేజర్ పంచాయతీల్లో నిషేధం అమలు అంతంతమాత్రంగానే ఉంది. ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి బయటకు వచ్చాక తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో కూరగాయలు, ఆహార పదార్థాలు, పండ్లు, వస్త్రాలు వంటి అన్ని రకాల వస్తువులను ప్లాస్టిక్ సంచుల్లోనే తీసుకువెళుతున్నారు. నెలావారీ లెక్కల కోసం హడావిడిగా కొన్ని దుకాణాలపై దాడులు చేయడం, కేసులు నమోదు చేసి జరిమానాలు విధించడంతో అధికారులు సరిపుచ్చుతున్నారు.

అనకాపల్లి జీవీఎంసీ పరిధిలో 2022 జూలై నెల నుంచి 2022 డిసెంబరు వరకు ప్లాస్టిక్ సంచులు విక్రయదారులపై దాడులు నిర్వహించి 825 కేసులు నమోదు చేశారు. సుమారు 42 కిలోల ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకొని రూ.42 వేలు జరిమానా విధించారు. 2023 జనవరి నెల నుంచి డిసెంబరు వరకు 2,113 కేసులు నమోదు చేసి, 98 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. రూ.1,32,702 జరిమానా విధించారు. 2024 జనవరి నుంచి జూన్ వరకు 250 కేసులు నమోదు చేసి 40 కిలోల సంచులు స్వాధీనం చేసుకున్నారు. రూ.1,55,200 జరిమానా విధించారు. నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల పరిధిలో కూడా కేసులు అంతంతమాత్రంగానే నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. నర్సీపట్నం మునిసిపాలిటీలోని మెయిన్ రోడ్డు, దుకాణాలు, కూరగాయల మార్కెట్లు నుంచి రోజుకి 100 కిలోల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయి. దీనిపై నర్సీపట్నం మునిసిపల్ కమిషనర్ రవిబాబును వివరణ కోరగా 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న పాలిథిన్ సంచులు విక్రయించకూడదని తెలిపారు. మునిసిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో హోల్‌సేల్ వర్తకులతో సమావేశం ఏర్పాటు చేసి పాలిథిన్ సంచులు విక్రయించవద్దని చెబుతామన్నారు. ప్లాస్టిక్ సంచుల వినియోగంపై నిషేధం విధించిన ప్రభుత్వం ఆ సంచుల తయారీ సంస్థలపై దాడులు నిర్వహించి, మూయించి వేస్తే అసలు మార్కెట్‌లోకి నిషేధిత ప్లాస్టిక్ సంచులు రావుకదాని పలువురు అభిప్రాయపడుతున్నారు. తయారీ సంస్థలపై ఎటువంటి చర్యలు చేపట్టకుండా ప్లాస్టిక్ సంచుల వినియోగంపై నిషేధం విధించడం ఎంతవరకు సమంజసమని పలువురు వ్యాపారులే ప్రశ్నిస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధం విధించిన ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా గోనె, కాగితంతో తయారు చేసే సంచులను మార్కెట్‌లో అందరికీ అందుబాటు ధరల్లో ఉంచే విధంగా ప్రయత్నాలు చేయకపోవడం కూడా ప్లాస్టిక్ సంచుల వియోగానికి ఒకింత ప్రధాన కారణంగా చెబుతున్నారు.

దూరవిద్యలోనూ ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

కొన్ని కాలేజీల యాజమాన్యాలు యత్నిస్తున్నాయి.

స్టడీ సెంటర్లకు ఎగనామం

ప్రతి అవసరానికి ఏయూలోని దూర విద్యా కేంద్రానికి రావడం విద్యార్థులకు ఇబ్బంది అవుతుంది. దీనిని దృష్టి ఉంచుకుని దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో గతంలో ఇటు శ్రీకాకుళం జిల్లా నుంచి అటు గుంటూరు జిల్లా వరకు పది స్టడీ సెంటర్లను ఏర్పాటుచేశారు.

ఈ స్టడీ సెంటర్లలో విద్యార్థులకు అవసరమైన సేవలు అందించేలా సిబ్బందిని నియమించారు. అడ్మిషన్ ఇవ్వడం దగ్గర నుంచి ఫీజులు వసూలు, పుస్తకాల పంపిణీ వంటి సేవలను అందించేవారు. అయితే, ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తున్నామని చెప్పి ఈ స్టడీ సెంటర్లను అధికారులు పూర్తిగా ఎత్తేశారు.

సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన సదస్సులు

గొలుగొండ, జూలై 2 : సీజనల్ వ్యాధులైన డయేరియా, మలేరియా, డెంగ్యూ తదితరాల నియంత్రణపై అవగాహన కలిగిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్, చీడిగుమ్మల పీహెచ్‌సీ వైద్యాధికారి ధనుంజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మాట్లాడుతూ జూలై నెల నుంచి ఆగస్టు 31 వరకూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సీజన్‌లో జ్వరాలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆస్పత్రుల్లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చోడవరం
నియోజకవర్గం

ఘనంగా మోదమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం, జూలై 2: మండల కేంద్రంలో శ్రీమోదమాంబ అమ్మవారి పండగ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానికి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నున్న ఆలయం వద్ద భక్తులు వేకువ జాము నుంచి బారులుదీరి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం నిర్వాహకులు గంజి వెంకట రమణ ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. రాత్రి ఘటాలతో మహిళలు గ్రామంలో ఊరేగింపు జరిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆల యంలో మంగళవారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులులేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



రాజాం చెక్ పోస్టు వద్ద కారును తనిఖీ చేస్తున్న ఎస్ఐ

బుచ్చెయ్యపేట, జూలై 2 : రాష్ట్ర హోంమంత్రి అనిత జారీ చేసిన ఆదేశాల మేరకు గంజాయి నిరోధంపై పోలీసులు అప్రమత్తమైయ్యారు. ఏజెన్సీ ముఖద్వారమైన వడ్డాది కూడలి, రాజాం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. మంగళవారం రాజాం చెక్‌పోస్టు వద్ద వివిధ వాహనాలను క్షుణంగా తనిఖీ చేశారు. రికార్డులేని పలు వాహనదారులపై కేసులు నమోదు చేశారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ ఈశ్వరరావు ఈ సందర్భంగా హెచ్చరించారు.

అధికారుల తీరుపై టీడీపీ నేతల ఆగ్రహం

బుచ్చెయ్యపేట, జూలై 2: మండలంలో అధికారులు, ఉద్యోగుల తీరుపై తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సారథ్యంలో పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. కానీ, దిబ్బిడి గ్రామ సచివాలయానికి చెందిన డిజిటల్ అసిస్టెంట్ శంకుతల ఎన్డీఏ కూటమి నేతలకు సమాచారం ఇవ్వకుండా పింఛన్ పంపిణీ చేపట్టడాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఎంవీవీ సత్యనారాయణ, నాయకుడు డొంకిన అప్పలనాయుడు ఆక్షేపించారు. ప్రభుత్వం మారినా వైఖరి మార్చుకోని అధికారులు, ఉద్యోగులను ఉపేక్షించేది లేదని వారు హెచ్చరించారు. డీఏ శంకుతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గోకులం షెడ్ల బిల్లుల మంజూరులో అవకతవకలు

▸▸ రోలుగుంట మండల సమావేశంలో సభ్యుల నిలదీత



పశువైద్యాధికారిని ప్రశ్నిస్తున్న రోలుగుంట ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ

రోలుగుంట, జూలై 2 : గతంలో గోకులం పథకం ద్వారా పశువుల షెడ్లు నిర్మించుకున్న రైతులకు నేటికీ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్న రైతులకు న్యాయం చేయాలని రోలుగుంట ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ అధికారులను కోరారు. వీటి నిధులు మంజూరులో అవకతవకలు జరిగాయని, విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలను సమావేశం దృష్టి తీసుకువచ్చారు. అలాగే రోలుగుంట జూనియర్ కళాశాలకు వెళ్లే మార్గంలో విద్యుత్ దీపలు ఏర్పాటు చేయాలని రామకృష్ణ ఈసందర్భంగా కోరారు. అలాగే, గతంలో నిర్వహించిన రీసర్వేలో చాలామంది రైతుల భూముల్లో హెచ్చుతగ్గులు ఉన్నాయని, వీటిని సరిచేయాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. పశువైద్యాధికారి నూకేశ్వరరావు మాట్లాడుతూ పాడిరైతులకు 2 టన్నుల పశుగ్రాస విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. 20 శాతం రైతు వాటాతో పశుబీమా పథకం అమల్లో ఉందని పేర్కొన్నారు. కుసర్లపూడిలో పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో వర్షం నీటికి మందులు తడిసిపోతున్నాయని మరమ్మతు చేపట్టాలని స్థానిక ప్రజా ప్రతినిధి చేపట్టాలని కోరారు. డీటీ శేఖర్ మాట్లాడుతూ పాత వెబ్‌ల్యాండ్ ప్రకారమే డిజిటల్ సిగ్నేచర్ అవుతుందని, రీసర్వే పూర్తియిన గ్రామాలకు సర్వేనెంబర్లకు డిజిటల్ సిగ్నేచర్ అవ్వడం లేదని, ప్రభుత్వం దీనికి ఆప్షన్ ఇవ్వలేదని వివరించారు. దీనివలన రిజిస్ట్రేషన్‌కు పలుమార్లు ఇబ్బందులుపడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

కంచుగుమ్మలలో విద్యుత్ కోతలతో ఇబ్బందులు తలెత్తుతున్నట్టు గ్రామ సర్పంచ్ బండారు శ్రీనివాసరావు తెలిపారు. అలాగే గుండుబాడు, జగ్గంపేట, జె.నాయుడుపాలెంలో తరచూ కరెంట్ నిలిపివేతతో అంధకారంలో ఉంటున్నామని, విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితంలేదని జె.నాయుడుపాలెం సర్పంచ్ బగుడు వెంకటరమణ ఆరోపించారు. కుసర్లపూడి జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఏఈ పద్మనాభం మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ఎన్నికల ముందు రత్నంపేట-ఏటిగైరంపేట వేసిన తారురోడ్డు మూడు నెలలకే ధ్వంసమైందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని సర్పంచ్ గరగా విశ్వేశ్వరరావు తెలిపారు. దీనిపై ఈ ప్రాజెక్టు డీఈ మోహన్ మాట్లాడుతూ తక్షణమే పరిశీలించి మరమ్మతు పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జాన్ లింకన్, తహసీల్దార్ రవిచంద్ర, ఈఓఆర్డీఓ నూకరాజు, జడ్పీటీసీ సభ్యుడు పోతల రమణమ్మ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య విశాఖ డెయిరీ ఎన్నిక

▸▸ అధ్యక్షుడిగా పేరపు కొండబాబు ఏకగ్రీవ ఎన్నిక



తునివలస పాలకేంద్రం పోలీసు బందోబస్తు

చీడికాడ, జూలై 2: మండలంలో తునివలసలో పోలీస్ బందోబస్తు మధ్య విశాఖ డెయిరీ సంఘం అధ్యక్ష ఎన్నిక ఏక గ్రీవంగా జరిగింది. పాల కేంద్రంలో జరిగిన అధ్యక్ష ఎన్నిక కోసం గత రెండు రోజులుగా ఇరువర్గాల వారు డైరెక్టర్లతో శిబిరాలు ఏర్పా టు చేశారు. మంగళవారం ఉదయం అధ్యక్ష ఎన్నిక జరుగు తుందని విశాఖడెయిరీ నుంచి ఆదేశాలు రావడంతో అయితే తగాదాలు తలెత్తుతాయేమోనని ముందుగా టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పేరపు కొండబాబు ఎస్ఐ నారాయణరావుకి ఫోన్‌చేశారు. ఆయన ఏఎస్ఐతోపాటు మరో పదిమంది పోలీసులతో తునివలస పంపించారు. ఉదయం 10గంటలకు జరిగిన ఎన్నిక నేపథ్యంలో చుట్టూ బందోబస్తు ఏర్పాటుచేసి లోపల డైరెక్టర్‌లను తప్ప మిగతా వారు ఎవరినీ రానీయలేదు. అనంతరం అధ్యక్షుని ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షునిగా టీడీపీకి చెందిన పేరపు కొండబాబు (తేజ)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పేరపు కొండబాబు, వైసీపీ మాజీ సర్పంచ్ పడాల అప్పలనాయుడుతోపాటు గ్రామస్థులు నూతన అధ్యక్షుడిని అభినందించారు.

ఆశ కార్యకర్తల పారితోషికం చెల్లించాలి



పెదగోగాడ పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

చీడికాడ, జూలై 2: ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లవద్ద ఏర్పాటుచేసిన వైద్య శిబిరాల్లో పాల్గొన్న ఆశ వర్కర్లకు వెంటనే పారి తోషకం చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడు నాయుడు, ఆశ వర్కర్ల యూని యన్ మండల నాయకులు తంగేటి మంగ, పరవాడ రాధ కోరారు. ఈ మేరకు పెదగోగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఉషాచైతన్యకు, చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావులకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఈశ్వరమ్మ, సత్యవతి, కమలకుమారి, దేవుళ్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: ఎన్నికల విధుల్లో విధుల్లో పాల్గొన్న తమకు పారితోషికం ఇవ్వాలని ఆశ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు సీపీఎం నాయకుడు డి.వెంకన్న ఆధ్వర్యంలో వైద్యాధికారి పూజిత మేఘనకి మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం, రూ.200 పారితోషికం ఇచ్చారన్నారు. కార్యకర్తలు పద్మ, సుజాత, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పెన్షన్లతో వృద్ధులకు ఆర్థిక భరోసా



తామరబ్బలో చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్యకర్తలు

దేవరాపల్లి, జూలై 2: మండలంలోని తామరబ్బ గిరిజన పంచాయతీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్ర పటానికి టీడీపీ కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. ప్రభుత్వం ఏర్పాటైన కొద్దిరోజుల్లోనే చంద్రబాబుకు ఎన్నికల మేనిఫెస్టో అమలు చేసిన ఘనత దక్కుతుందన్నారు. ఎన్టీఆర్ పెన్షన్లు మంజూరు చేసి వృద్ధులకుఆర్థికంగా మనో ధైర్యం కల్పించారన్నారు. నాయకులు పైడిరాజు, అప్పలకొండ, రాజుబాబు, రాజు, పెన్సన్‌లు పంపిణీ చేశారు.

99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

రావికమతం, జూలై 2: మండలంలో 99 శాతం మేర సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్టు ఎంపీడీవో భానోజీరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పింఛన్ల పంపిణీ తొలిరోజే 94శాతం లబ్ధిదారులకు నేరుగా అందజేశామన్నారు. మండంలో 22 గ్రామ సచివాలయాల పరిధిలో 12,351 మంది లబ్ధిదారులకు రూ.83,75,500 నిధులు విడుదల కాగా ఇంత వరకూ 12,205 మంది లబ్ధిదారులకు తమ సిబ్బంది ద్వారా ఇళ్లకు వెళ్లి పింఛన్లు నగదును అందజేశామన్నారు. ఇంకా 146 మంది మిగిలిన వారిలో 81 మంది చనిపోయిన వారుపోగా కేవలం 65 మంది మాత్రమే ఇవాల్సి ఉన్నట్టు వివరించారు.

మాడుగుల: ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు లబ్ధిదారులకు దాదాపుగా పూర్తిస్థాయిలో అందించినట్టు ఎంపీడీవో కళీ ప్రసాదరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 11వేల 9వందల 18 పెన్షనర్లకు 8 కోట్ల పదిలక్షల 685 రూపాయలు మంజూరు కాగా, వారిలో తొలిరోజు 11వేల 7వందల 34పెన్షన్లు పంపిణీ చేశామన్నారు. మిగిలిన 184 పెన్షన్లలో 123మంది పెన్షనర్లు మృతిచెంది చెందారన్నారు. కాగా 61మంది దూర ప్రాంతాల్లో వివిధ కూలిపనులకు వెళ్లారని, వారికి సమాచారం ఇచ్చామని వారి వచ్చిన వెంటనే పెన్షన్లు అందించనున్నట్టు వివరించారు.

మాడుగుల
నియోజకవర్గం

ఆర్‌సీఎం పాఠశాల రికార్డులు హైస్కూల్‌కి అప్పగింత

మాడుగుల, జూలై 2 : మాడుగుల ఆర్‌సీఎం ఎయిడెడ్ పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన రికార్డులను స్థానిక బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి మంగళవారం అప్పగించారు. ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు చాలా ఏళ్లుగా కొనసాగిన ఆర్‌సీఎం ఎయిడెడ్ పాఠశాల ఎట్టకేలకు మూతపడింది. ఈ పాఠశాలలో చదువుతున్న సుమారు 500 మంది విద్యార్థులకు టీసీలు ఇచ్చి పంపించారు. అయితే, ఆ పాఠశాలలో చదివిన విద్యార్థులకు సంబంధించి వివరాలు రికార్డులను విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు బాలుర ఉన్నత పాఠశాలకు అప్పగించారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాటిని ఆ పాఠశాలలో పొందుపరిచారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పినకోటలో కాలువలను పరిశీలిస్తున్న మలేరియా అధికారి శాంతి ప్రభ

దేవరాపల్లి, జూలై 2: మండలంలోని జీనబాడు బాలికల ఆశ్రమ పాఠశాల, పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జోనల్ మలేరియా అధికారి ఎం.శాంతి ప్రభ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో పరిసరాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. హాస్టల్ ఆనుకొని ఉన్న నీటి నిల్వను తొలగించాలని సూచించారు. అనంతరం పినకోట పీహెచ్‌సీలో ఆశ వర్కర్లు, సిబ్బందితో మాట్లాడారు. హైరిస్క్ (మలేరియా) గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుధ్యం పరిశీలించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు జి.వెంకటేష్, డి.రూప్‌చంద్‌తో పాటు ఈమె వెంట అదనపు మలేరియా అధికారి ఎ. జె. సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈఓ బి.తిరుపతిరావు, గంగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ రవిశర్మ, సబ్‌యూనిట్ అధికారి బాబూరావు, సావిత్రి, పర్యవేక్షకులు సింహాచలం, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీదేవి, పార్మ్ సిస్ట్ అశ్విని, ప్రధానోపాధ్యాయిని మల్లేశ్వరి, మాజీసర్పంచ్ రాంబాబు, ఏఎన్ఎం. పుష్పరామరాజు తదితరులు పాల్గొన్నారు.

'గ్రామ సభలను అపహాస్యం చేస్తున్నారు'

దేవరాపల్లి, జూలై 2 : రాజ్యాంగ బద్ధంగా జరపాల్సిన గ్రామ సభలను అధికారులు అపహాస్యం చేస్తున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి. రమణ అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సభల షెడ్యూల్ వారం రోజులు ముందు షెడ్యూల్ విడుదల చేయాలని, కానీ, ఈ విధంగా చేయడంలేదన్నారు. ఈ కార్య క్రమంలో కె. శ్రీను, చొక్కాకుల రమణ, సంతోష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.